# గోల్కొండ టైమ్స్

GOLCONDA TIMES NEWS

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com | మంగళవారం 24, మార్చి 2026 | పేజీలు : 04


## చిక్కుల్లో దానం

- వీడని పార్టీ ఫిరాయింపుల కేసు
- దానం నాగేందర్‌కు తప్పని చిక్కులు
- స్పీకర్ తీర్పును కొట్టేయాలని పిటిషన్
- దానంతో సహా స్పీకర్ కు హైకోర్టు నోటీసులు



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. స్పీకర్ తీర్పుతో ఈ వ్యవహారం ముగిసిపోయింది అనుకుంటున్న తరుణంలో.. మరోసారి తెరపైకి వచ్చింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో దానం నాగేందర్ విషయంలో స్పీకర్ తీర్పును కొట్టేయాలని.. హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో విచారణ జరిపిన హైకోర్టు.. దానం నాగేందర్‌కు నోటీసులు ఇచ్చింది. అసెంబ్లీ కార్యదర్శికి కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

తెలంగాణలో సంచలనం రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఇటీవలె అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇస్తూ.. స్పీకర్ తన తుది నిర్ణయాన్ని వెలువరించారు. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ దక్కినట్లు అయింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని

మిగతా 2లో...



## విచారణ అంటే అంత అలుసా?

- వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉండదు
- రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు విచారణపై హైకోర్టు సీరియస్



## పైలట్ రోహిత్‌రెడ్డి కస్టడీకి కోర్టు అనుమతి

- ఆయన సోదరుడు, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మ కస్టడీకి గ్రీన్ సిగ్నల్
- మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

# మూసీ నిర్వాసితుల్ని నిరాశ్రయులం చేయం

## మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం

- నల్గొండ ప్రజల ఇబ్బందులు తెలిసిన నాయకులెవరూ ఈ ప్రాజెక్టును అడ్డుకోరు
- మూసీ ప్రక్షాళన అంశంపై సలహాలు, సూచనల కోసం డిప్యూటీ సీఎం అధ్వర్యంలో కమిటీ
- శాసనమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి



రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపిన శాసన మండలి, శాసనసభ ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు.

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

మూసీ ప్రక్షాళన కోసం చేపట్టే ప్రాజెక్టులో పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవరినీ నిరాశ్రయులను చేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు, ఏ ఒక్కరికీ నష్టం జరక్కుండా వారందరికీ మరింత మెరుగైన వసతులతో ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు సహాయాన్ని అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.మూసీ ప్రక్షాళనకు సంబంధించిన ప్రణాళికలను క్షుణ్ణంగా చదివి, ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు చేస్తే ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని చెప్పారు.హైదరాబాద్ నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలు, 1 లక్షకు పైగా చ.కి.మీ మేర విస్తరించిన రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ దార్శనికతను ఈ సందర్భంగా సీఎం సభముందు సమగ్రంగా వివరించారు. సీఎం వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే...

దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో తలెత్తుతున్న విషమ పరిస్థితులను గమనంలోకి తీసుకుని చరిత్రాత్మక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవం తీసుకురావడానికి, అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఉంది. నల్గొండ ప్రజల జీవన స్థితిగతులు, వారి ఆవేదనా భరితమైన జీవిత సత్యాల గురించి ఆలోచన చేసే వారెవరూ ఈ ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన చేయరు. కావాలనుకుంటే మూసీ ప్రక్షాళన అంశంపై సలహాలు, సూచనలు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కనేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తాం. ఏ రాష్ట్ర ప్రగతి అయినా ఆ రాష్ట్ర నగరాలు, పెట్టుబడులు, ప్రజల జీవన స్థితిగతులపై ఆధారపడి ఉంటాయి. 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో ఎప్పుడు చర్చ జరిగినా..

మిగతా 2లో...

## మీ స్థలం.. మాకు అక్కరలేదు

- మధు రిడ్జ్‌తో గాంధీ సరోవరకు నష్టం లేదు
- దాన్ని ఎవరూ కొనరు.. అమ్మరు
- మూసీ బఫర్ జోన్‌తో నివాసితులకే ప్రాబ్లం
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం మధు రిడ్జ్ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవడం లేదని, 50 మీటర్ల బఫర్ జోన్లో ఉందని భవిష్యత్తులోనూ వారికి నష్టమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో అత్యంత వివాదాస్పదమైన మధు రిడ్జ్ పార్క్ అపార్ట్‌మెంట్ స్థలంపై అసెంబ్లీ వేదికగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి మధు రిడ్జ్ పార్క్ అపార్ట్‌మెంట్ స్థలం తీసుకోకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఆ అపార్ట్‌మెంట్ స్థలాన్ని ప్రభుత్వం అడగలేదని ఆయన తేల్చి చెప్పారు. మూసీ బఫర్ జోన్ వల్లే అపార్ట్‌మెంట్ వాసులకు నష్టం వాటిల్లుతుందని, భూమి ఇస్తే కనుక వారికి పరిహారం చెల్లించి ప్రత్యామ్నాయం చూపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

**బఫర్ జోనే..**

గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన 98 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, అది తమకు సరిపోతుందని ఆయన వివరించారు. 2005-06లో అపార్ట్‌మెంట్ వాసులు దాన్ని చిన్న నాలాగా చూపించి పర్మిషన్ తీసుకున్నారు. 2012, 2016లో పరిశీలిస్తే 50 మీటర్లలో బఫర్ జోన్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అపార్ట్ మెంట్ సగం వరకు బఫర్ జోన్లో ఉందని క్లారిటీ ఇచ్చారు.

**పరిహారం చెల్లింపుపై ప్రకటన..**

అపార్ట్‌మెంట్ వాసులకు ఉన్న అసలు సమస్య బఫర్ జోన్ మార్పు వల్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బఫర్ జోన్ నిబంధనల కారణంగా ఆ అపార్ట్‌మెంట్‌ను భవిష్యత్తులో ఎవరూ కొనలేరని,

మిగతా 4లో...

## హామీలేవీ ? గ్యారంటీల అమలెక్కడా ?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని ఆరోపణ
- పంటలకు ఇస్తామన్న బోనస్ హామీ 'బోగస్'



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. 'భట్టి విక్రమార్క మాటలకు అర్థాలే వేరులే అన్నట్టుగా రాష్ట్ర పరిస్థితి ఉంది' అంటూ ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని ఆరోపించారు. వేలాది మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ వర్తించలేదని, రైతులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలతో పాటు క్షేత్రస్థాయిలో గ్యారంటీల అమలు తీరుపై ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో కరోనా వంటి కష్టకాలంలో కూడా తాము (బీఆర్ఎస్) రైతుబంధును నిరంతరాయంగా ఇచ్చామని హరీష్ రావు తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే రైతు భరోసా ఇస్తోందని, ఒక్క పంటకు కూడా సరిగ్గా పెట్టుబడి సాయం అందడం లేదని విమర్శించారు. రైతు భరోసాను రూ.15 వేలకు ఎప్పుడు పెంచుతారో..

మిగతా 2లో...

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఫ్రీ జర్నీ

- సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు
- హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం
- మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రావడం లేదు
- మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి సిటీ ప్లాన్

2లో..

## హైదరాబాద్ అభివృద్ధికి రోడ్ మ్యాప్

- మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలతో బృహత్తర ప్రణాళికలు
- ఒక గొడుకు కిందికి ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన
- మెట్రో, రోడ్ల విస్తరణపై అసెంబ్లీలో సీఎం రేవంత్

## బియ్యం కుంభకోణంపై హౌజ్ కమిటీ వేయాలి

- బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం
- నిందితుడు మీ సలహాదారుడా..?
- అధికార పక్షంపై హరీశ్ రావు ఫైర్
- మంత్రి ఉత్తమ్ కౌంటర్

02

# క్యూనెట్ ఆగడాలకు చెక్..!

- మూడు రాష్ట్రాల్లో సోదాలు
- 43 మంది అరెస్ట్
- హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్



**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

దేశవ్యాప్తంగా మల్టీలెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) పేరిట కోట్లాది రూపాయల మోసాలకు పాల్పడుతున్న 'క్యూనెట్' సంస్థ ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. పక్కా సమాచారంతో మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి 11 మంది మహిళలు సహా 32 మంది కీలక నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. సోమవారం బషీర్‌బాగ్ సీసీఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పంచుకున్నారు. సిద్దిపేటకు చెందిన హరికృష్ణ అనే వ్యక్తి క్యూనెట్ వలలో పడి రూ.5 లక్షలు పోగొట్టుకుని, సంస్థ మోసాలను వివరిస్తూ సూసైడ్ నోట్ రాసి అక్టోబర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సజ్జనార్ తెలిపారు. క్యూనెట్‌పై తెలంగాణ వ్యాప్తంగా 68, హైదరాబాద్‌లో 22 కేసులు (ఇటీవల మరో 4) నమోదయ్యాయి. ఎస్బీ జాయింట్ సీపీ ఆధ్వర్యంలో 30 ప్రత్యేక బృందాలతో మూడు రాష్ట్రాల్లోని 27 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్..**

సీపీ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం.. సెకండ్ ఇన్‌కమ్ (అదనపు ఆదాయం) ఆశచూపి స్టార్ హోటళ్లలో మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. విలాసవంతమైన కార్లు, ఇళ్లు చూపిస్తూ ఐటీ ఉద్యోగులను ప్రధానంగా బురిడీ కొట్టిస్తున్నారు. డబ్బుల్లేని వారికి ప్రైవేట్ ఫైనాన్స్, ఫిన్‌టెక్ యాప్‌ల ద్వారా లోన్లు ఇప్పించి మరీ పెట్టుబడులు పెట్టిస్తున్నారు. 1998 నుంచి ఈ నిర్వాహకులు వివిధ పేర్లతో చీటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సంస్థ పేరు చెప్పకుండా బాండ్ పేపర్లు రాయించుకుని వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్లు, తేనె వంటి వస్తువుల అమ్మకాల నెపంతో మోసాలకు పాల్పడుతున్నారు.

**ఈడీకి సమాచారం.. ప్రజలకు సీపీ హెచ్చరిక..**

ఈ భారీ కుంభకోణంలో మనీ లాండరింగ్ కోణం కూడా ఉన్నందున, తదుపరి విచారణ నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సమాచారం అందజేస్తామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చంటూ వచ్చే మోసపూరిత ఆఫర్ల పట్ల అమాయక ప్రజలు ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## డీలిమిటేషన్ జరిగితే మహిళలకు 50 ఎమ్మెల్యే సీట్లు




- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మొదటి కార్యవర్గ సమావేశం

04

## ప్రజలను తాగుబోతుల్ని చేసిందెవరూ..?

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లకు అప్పు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

02



## ప్రతి పోలింగ్ కేంద్రానికి బీఎల్‌ఏల నియమించాలి

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి కర్ణన్

రాజకీయ పార్టీలతో సమావేశం

02

## ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరుపుకోవాలి

డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

03

బందోబస్తుపై కమిషనర్, సీపీ అధికారులకు దిశానిర్దేశం

## రైల్వే ప్రాజెక్టులపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలి

04

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కోరిన ఎంపీ అర్వింద్

## పైశాచిక కాంగ్రెస్ ప్రజలను మోసం చేసే పాలన

- ఆరు గ్యారంటీల అమలుపై బీజేపీ ఛలో అసెంబ్లీ
- పోలీసుల అడ్డగింతపై ఆ పార్టీ ఎమ్మెల్యేల మండిపాటు



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలను' రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. హామీల అమలు కోరుతూ బీజేపీ చేపట్టిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి నుండే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, గతంలో కేసీఆర్ పాలన కంటే..

మిగతా 2లో...

# హైదరాబాద్ అభివృద్ధికి రోడ్ మ్యాప్

**మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలతో బృహత్తర ప్రణాళికలు**
**ఒక గొడుకు కిందికి ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన**
**మెట్రో, రోడ్ల విస్తరణపై అసెంబ్లీలో సీఎం రేవంత్**

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి హైదరాబాద్ నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించామని చెప్పారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సీఎం సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా మెట్రో, రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లక్ష్యంతో రూ. 24 వేల కోట్లతో మెట్రో రెండో దశ 76 కిలమీటర్ల మేరకు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. "మూసీ సుందరీకరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించుకోవడంతో హైదరాబాద్ ఒక అద్భుతమైన నగరంగా మారుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను 3 రకాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు తీసుకున్నట్లు వివరించారు. అండర్ పాస్, సర్ఫేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు

.ఉత్తర తెలంగాణ మార్గంలో అటు కరీంనగర్, ఇటు మేడ్చెల్ వైపు కంటోన్మెంట్ ప్రాంతం బాటిల్ నెక్‌గా మారిందన్న ఆయన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రక్షణ శాఖ నుంచి 153 ఎకరాలు సేకరించినట్లు చెప్పారు. రక్షణ శాఖకు భూమికి బదులుగా భూమి కేటాయించామనీ దేశంలో ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నామన్నారు. పనులు కొనసాగుతున్నాయని వివరించారు. నల్గొండ వైపు వెళ్లే వారికి బాటిల్ నెక్‌గా మారిన నల్గొండ చౌరస్తా జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్, జూలై నాటికి అందుబాటులోకి రానుందని ప్రకటించారు. బాటిల్ నెక్స్‌ను తొలగించి నిరంతర ప్రయాణానికి 29 ప్రాంతాల్లో అండర్ పాస్, సర్ఫేస్ రోడ్స్, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట చౌరస్తా తదితర ప్రాంతాల నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న సీఎం... కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్, ఎమ్మెల్యే కాలనీ, దుర్గం చెరువు, రామానాయుడు స్టూడియో, హైకోర్టు జడ్జెస్ క్వార్టర్స్, మహాప్రస్థానం, కోహినూర్ హోటల్ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ పార్క్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి దానిని పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో 9వ స్థానంలోకి పడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్, రామచంద్రాపురం లాంటి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ప్రాంతాలకు మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మెట్రో పనులను విస్తరించాలని భావించినప్పుడు ఎల్ అండ్ టీ సంస్థ ఈ వ్యాపారం నుంచి తప్పుకున్నామని ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించిందన్నారు. ఎల్బీనగర్ వద్ద మెట్రో ఆగిపోయిందనీ హైదరాబాద్‌కు ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరించాలన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ లేదు. అందుకే నాగోల్, ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రోను పొడగిస్తున్నామన్నారు.

గౌలిగూడ వద్ద ఆగిపోయిన మెట్రో పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా, చాంద్రాయగుట్ట జంక్షన్‌కు కనెక్ట్ చేస్తున్నాం. లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు పొడగించాల్సి ఉందని వివరించారు. బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి అత్యధిక ట్రాఫిక్ ఉంటుంది. చందానగర్ వరకు, నియోపోలిస్ కనెక్ట్ చేస్తూ విస్తరించాల్సి ఉందన్నారు. నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో కూడా పాదచారులకు అనేక ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలేర్పడుతున్నాయన్నారు. చిరు వ్యాపారులకు కొంత కష్టమైనప్పటికీ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా ఆపరేషన్ రోప్ పేరుతో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. పార్కింగ్ కూడా అతిపెద్ద సమస్యగా మారిందనీ అందుకే కేబీఆర్ పార్క్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో మల్టిలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. 360 కి.మీ మేరకు విస్తరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డుకు ఓఆర్ఆర్‌కు మధ్యన రేడియల్ రోడ్లను చేపట్టినట్లు చెప్పారు.

మూసీ పునరుజ్జీవంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు గౌలిగూడ, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, నాగోల్ జంక్షన్లలో ట్రంపెట్లను ఏర్పాటు చేస్తూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని వివరించారు. ఈ కారిడార్ వల్ల హిమాయత్‌సాగర్ నుంచి గౌరవెల్లి వరకు 43 కిలోమీటర్ల మేరకు ఎలివేటెడ్ కారిడార్‌తో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. ఈ రకంగా 783 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కోర్ అర్బన్ రీజియన్ క్యూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చెల్ కార్పొరేషన్స్‌ను, 4 పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు.

## మూసీ నిర్వాసితుల్ని నిరాశ్రయులం చేయం

మొదటి పేజీ తరువాయి..

ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల గురించి ఎక్కువగా చర్చిస్తారు. హైదరాబాద్ అనగానే ప్రధానంగా ఫార్మా రంగంతో పాటు లివబుల్ సిటీగా గుర్తుచేసుకుంటారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా ఉన్న ముంబై వర్షాలొస్తే నివసించలేని పరిస్థితి. దేశ రాజధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం, బెంగళూరులో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా విపరీతమైన ట్రాఫిక్ జామ్‌లు. భారీ వర్షాలొస్తే చెన్నైలో పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి.ఆ మహానగరాల్లో ఎదురవుతున్న అనుభవాలను చూసిన తర్వాత అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఒకప్పుడు లేక్ అండ్ రాక్ సిటీగా విలసిల్లిన చారిత్రాత్మక హైదరాబాద్ ఇప్పుడు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఆ సమస్యలు భూ భౌగోళిక పరిస్థితుల కారణంగా తలెత్తినవి కాదు. మానవ తప్పిదాల కారణంగా తలెత్తిన సమస్యలు.

కులీకుతుబ్ షాహీల కాలంలో గుల్జార్ హౌజ్, ఫలక్‌నుమా, తారామతి భారాదరి, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీల నుంచి మొదలుపెడితే ఈరోజు సమావేశాలు నిర్వహించుకుంటున్న శాసనమండలి హాలు.. ఇలా ఎంతో చరిత్ర కలిగిన అద్భుతమైన నగరం ఇప్పుడు కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందుల వంటి ఎన్నో సమస్యలతో సతమతమవుతోంది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ఒక కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ జోన్‌లో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని నిర్ణయించాం. తద్వారా ఈ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. ఈ క్రమంలోనే హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలి వైపునకు తరలించి, ఇక్కడి పారిశ్రామిక జోన్‌లో ఉన్న భూములను మల్టీయూజ్ జోన్‌లోకి మార్చుతున్నామే, తప్ప యాజమాన్యపు హక్కులు మారవు. మల్టీయూజ్ జోన్‌లోకి మార్చడం వల్ల మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా మారుతాయి. పరిశ్రమలను తరలించడం ద్వారా నగరం కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నది మొట్టమొదటి ప్రణాళిక. 20 టీఎంసీ గోదావరి నీటని తరలించి అందులో 17 టీఎంసీ జంటనగరాల తాగునీటి కోసం, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం నీరు ప్రవహించేలా వినియోగిస్తాం. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం సమగ్రమైన ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేసుకున్నాం. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలివ్వండి. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారిని ఎవరినీ నిరాశ్రయులను చేయం. వారికి మరిన్ని మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం. ఏ ఒక్కరికి నష్టం చేయం.." అని ముఖ్యమంత్రి స్పష్టంగా వివరించారు.

## చిక్కుల్లో దానం

మొదటి పేజీ తరువాయి..

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పును ఇచ్చారు. అయితే ఇప్పుడు ఈ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. స్పీకర్ తీర్పును కొట్టివేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు.. నోటీసులు జారీ చేసింది.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని.. పిటిషనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచారని.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే.. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినట్లు పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకే దానం నాగేందర్ వ్యవహారంలో స్పీకర్ తీర్పు సరైంది కాదని.. దాన్ని కొట్టేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీ ఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌ను.. ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టుకు విన్నవించారు.

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాకుండా ఇతర పార్టీ నుంచి ఎంపీగా నామినేషన్ వేసిన రోజు నుంచే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రస్తావించారు.

అదే సమయంలో స్పీకర్ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి.. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో ఇటీవలె సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌తో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో తర్వాతి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఇప్పుడు స్పీకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎలాంటి వివరణ ఇస్తారు అనే దానిపై అందరి దృష్టి పడింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై దద్దరిల్లిన అసెంబ్లీ

**ప్లకార్డులతో బీఆర్ఎస్ సభ్యుల నిరసన**

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

అసెంబ్లీ ప్రాంగణం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలతో మార్మోగింది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో భారీ నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నట్టే, ఇప్పుడు విద్యార్థుల జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక వేల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం మరింత పటిష్టంగా కొనసాగించి విద్యార్థుల బంగారు బాటకు మార్గం చూపిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల కనీస చిత్తశుద్ధి లేదని, తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ నిరసనలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఫ్రీ జర్నీ

**సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు**
**హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం**
**మెట్రో విస్తరణకు ఎల్ అండీ టీ ముందుకు రాలేదు**
**మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి సిటీ ప్లాన్**



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీ అందించటమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు నగరం నడిబొడ్డు నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నామన్నారు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మెట్రో సేవలను కూడా విస్తరిస్తామన్నారు. కొత్తగా మరో 76 కి.మీ మేర మెట్రోను విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని వీటి నిర్మాణం ద్వారా నగర రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయని అన్నారు. నాలుగో రోజు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబిచ్చిన సీఎం.. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగిందన్నారు. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించామన్నారు. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నామన్నారు. బేగంపేట వద్ద పైన విమానాలు ఎగిరితే.. కింద అండర్‌పాస్ టన్నెల్ వస్తోందన్నారు. హైదరాబాద్ చారిత్రక నగరమని అనేక గొప్ప కట్టడాలు ఉన్నాయన్నారు. మానవ తప్పిదాలతోనే సమస్యలు వస్తున్నాయని.. ఆదాయ మార్గాలు పెరిగి ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయని అయినా సరే సిగ్నల్స్ వద్ద ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రద్దీ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నామని.. చిరువ్యాపారులకు ఇతరచోట్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని పలుచోట్ల మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు వేస్తున్నామని.. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు వస్తాయన్నారు.

### మూడు ప్రాంతాలుగా స్టేట్..

రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామన్నారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని.. ప్యూర్ రీజియన్‌లో పరిశ్రమలు ఉంటాయన్నారు. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చర్ సెక్టార్ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లోనే లైసెన్సులు రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిపాలన అంతా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చామని సీఎం వెల్లడించారు.

### అందుకే ఎల్ అండ్ టీ వద్దు..

మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదని.. కేంద్రప్రభుత్వ నిబంధన వల్ల మెట్రోను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నామన్నారు. మెట్రోను మరో 76 కిలోమీటర్లు విస్తరిస్తామని.. మెట్రో విస్తరణపై కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందని అన్నారు. ఇక డ్రైనేజ్ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుందన్నారు. సబర్మతి, యమున, గంగాను ప్రక్షాళన చేస్తామని అక్కడి సీఎంలు చెబుతున్నారని.. గుజరాత్ అభివృద్ధిలో బీజేపీకి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతిచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి సైతం అందరూ కలిసి రావాలని సీఎం రేవంత్ కోరారు.

## బియ్యం కుంభకోణంపై హౌజ్ కమిటీ వేయాలి

**బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం**
**నిందితుడు మీ సలహాదారుడా..?**
**అధికార పక్షంపై హరీశ్ రావు ఫైర్**
**మంత్రి ఉత్తమ్ కౌంటర్**

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**



రేషన్ బియ్యం ఎగుమతులపై అసెంబ్లీ అట్టుడికింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల చుట్టూ భారీ కుంభకోణం జరిగిందంటూ సోమవారం అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల కేసుల్లో నిందితుడిగా ఉన్నవ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌజ్ కమిటీ' వేయాలని డిమాండ్ చేశారు. రూ. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని బియ్యం ఎగుమతులకు అడ్వైజర్‌గా ఎందుకు నియమించుకున్నారని హరీశ్ రావు నిలదీశారు. ఆయన ఇచ్చిన తప్పుడు సలహాల వల్లే రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడిందని ఆరోపించారు. పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఫిలిప్పీన్స్ కు ఎగుమతి చేస్తామని, ఇది ఒక అంతర్జాతీయ విజయం అని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం.. తీరా చూస్తే కేవలం 22,750 టన్నుల దగ్గరే ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులోనే నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, దీనికి బాధ్యులు ఎవరని ఆయన అడిగారు. వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఎగుమతులు ఆగిపోయాయని హరీశ్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ పాలన పారదర్శకంగా ఉంటే, తాము తప్పు చేయలేదని భావిస్తే.. ఈ కుంభకోణాలపై విచారణకు హౌజ్ కమిటీ వేయాలని, దీనిని తాము ఆధారాలతో సహా నిరూపిస్తామని సవాల్ విసిరారు.

### మంత్రి ఉత్తమ్ స్ట్రాంగ్ కౌంటర్..

హరీశ్ రావు ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. హరీశ్ రావు సిఫార్సు చేసిన వారిని అడ్వైజర్లుగా పెట్టుకోలేదనే అక్కసుతోనే సభలో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇది కేవలం తెలంగాణ ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ ప్రభుత్వం మధ్య జరిగిన ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం వల్ల అక్కడ అన్ని రకాల దిగుమతులపై ఆంక్షలు విధించారని, అయితే కేవలం తెలంగాణ రైస్ ఇంపోర్టుకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని తెలిపారు. కేవలం ఒక్క రేషన్ బియ్యం షిప్‌మెంట్ మాత్రమే కాకినాడలో ఆగిపోయిందని మంత్రి ఉత్తమ్ వివరణ ఇచ్చారు.



## విద్యుత్ కార్మిక మృత కుటుంబాలకు రూ.కోటి ఎక్స్ గ్రేషియా

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి రూ. 1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సమక్షంలో బాధితులకు చెక్కులు అందించారు. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.1 కోటి చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంచామన్నారు. సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడకూడదని కుటుంబ బీమా తీసుకొచ్చామన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజహరుద్దీన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజలను తాగుబోతుల్ని చేసిందెవరూ..?

**బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లకు అప్ప**
**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మద్యాన్ని ప్రోత్సాహించిందెవరు?.. తెలంగాణ ప్రజలను తాగుబోతులను చేసింది ఎవరో ప్రస్తుత లెక్కలను చూస్తే తెలిసిపోతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. 60 ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.65 వేల కోట్లకు మించి పోలేదని.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లకు చేరిందని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడి.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.10 వేల కోట్ల లోపు ఉండేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.36 వేల కోట్లకు పెరిగిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.2 వేల కోట్లు తగ్గిందని చెప్పారు.

## విచారణ అంటే అంత అలుసా...?

**వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉండదు**
**రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు విచారణపై హైకోర్టు సీరియస్**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై హైకోర్టు సీరియస్ అయింది. ఈ విచారణకు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని గతంలోనే ఆదేశించినప్పటికీ, ఆయన హాజరుకాకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఆ పనుల్లో నిమగ్నమై ఉండటంతోనే ఫైనాన్స్ సెక్రటరీ విచారణకు రాలేకపోయారని కోర్టుకు వివరించారు. ఈ కారణంతో ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, ఈ విన్నపాన్ని హైకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేయడంపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. 'రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు. కోర్టు ఆదేశించినా అధికారి రాకపోవడం ఏంటి?' అని ప్రశ్నించింది. తాము ఇవాళ అర్ధరాత్రి వరకు కోర్టు హాలులోనే ఉంటాం.. కానీ ఫైనాన్స్ సెక్రటరీ మాత్రం ఖచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందేనని కోర్టు పేర్కొంది. ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి ఎలాంటి మినహాయింపు ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.కాగా రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలు గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. తమ జీవితకాలపు పొదుపు మొత్తాల కోసం వృద్ధాప్యంలో కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్టు స్పందిస్తూ ఆర్థిక శాఖను వివరణ కోరింది. ఈ క్రమంలోనే మరికాసేపట్లో ఫైనాన్స్ సెక్రటరీ కోర్టు ముందు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ కేసులో కోర్టు ఎలాంటి కీలక ఆదేశాలు జారీ చేస్తుందోనని ఆసక్తికరంగా మారింది.

## పైలట్ రోహిత్‌రెడ్డి కస్టడీకి కోర్టు అనుమతి

- ఆయన సోదరుడు, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మ కస్టడికీ గ్రీన్ సిగ్నల్
- మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ముగ్గురిని విచారించడం ద్వారా డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలను, సరఫరాదారుల వివరాలను రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. కాగా ఈ నెల 14న మొయినాబాద్‌లోని రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌పై ఈగల్ టీమ్ నిర్వహించిన దాడుల్లో డ్రగ్స్‌తో పాటు ఆయుధాలు కూడా లభ్యమయ్యాయి. సోదాల సమయంలో నమిత్ శర్మ పోలీసులపైకి కాల్పులు జరపడం కలకలం రేపింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న వీరిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని, విచారణ నిమిత్తం రహస్య ప్రాంతానికి తరలించే అవకాశం ఉంది. డ్రగ్స్ పార్టీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? ఇంకా ఎవరెవరికి ఇందులో ప్రమేయం ఉందనే కోణంలో 'సిట్' అధికారులు తమ దర్యాప్తును వేగవంతం చేయనున్నారు.



## ప్రతి పోలింగ్ కేంద్రానికి బీఎల్‌ఏల నియమించాలి

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి కర్ణన్
- రాజకీయ పార్టీలతో సమావేశం

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

పోలింగ్ కేంద్రాలకు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ)లను నియమించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై అదనపు కమిషనర్ (ఎలక్షన్) కె. చంద్రకళతో కలిసి సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ , హైదరాబాద్ డీఈఓ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ.. నగరంలోని మొత్తం 4062 పోలింగ్ కేంద్రాలకు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ)ను ఈ నెల 30వ తేదీ లోపు నియమించాలని రాజకీయ పార్టీలను కోరారు. బీఎల్ఏలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరించాలని, ఓటర్లను చైతన్యపరిచే దిశగా ఫీల్డ్ స్థాయి కార్యకర్తలను వినియోగించాలని సూచించారు. ఓటర్ల తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలకు స్పందించిన కమిషనర్, మరణించిన ఓటర్లు మరియు డూప్లికేట్ నమోదులను నిర్దిష్ట విధి విధానాల ప్రకారం మాత్రమే తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలు, విధి విధానాలును కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా సవరణ ప్రక్రియ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డీఈఓ కోరారు. బహుజన్ సమాజ్ పార్టీ, భారతీయ జనతా పార్టీ, సీపీఐ(ఎం), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, భారత్ రాష్ట్ర సమితి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

## పైశాచిక కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి..

దారుణమైన నిర్బంధం ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కనిపిస్తోందని విమర్శించారు. ఇదే పద్ధతి అవలంబించిన బీఆర్ఎస్‌ను ప్రజలు గద్దె దించారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. మరోవైపు.. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు, చేస్తున్న ఖర్చులకు అస్సలు పొంతన లేదని ఆ పార్టీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. ఆడబిడ్డలకు నెలకు రూ. 2500, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి ఆకర్షణీయమైన హామీలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని, ఇలాంటి అరెస్టులకు బీజేపీ భయపడదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.

## హామీలేవీ? గ్యారంటీల అమలెక్కడా ?

మొదటి పేజీ తరువాయి..

స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు ఇస్తామన్న బోనస్ హామీ కేవలం 'బోగస్'గా మిగిలిపోయిందని, అటు రైతు కూలీలను కూడా ప్రభుత్వం దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల అన్నదాతలు అయోమయంలో ఉన్నారని, ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

### మంత్రి జూపల్లికి కౌంటర్..

'2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ.46,941 కోట్లు ఎక్సైజ్ మీద ఆదాయం వస్తుందని చెప్పారు. గత సంవత్సరం కంటే దాదాపు 12 వేల కోట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని అంటున్నారు. అంత ఆదాయం రావాలంటే 25వేల కోట్లు మద్యం అమ్మాలి. ఏకంగా 35% ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్తున్నారంటే, గల్లీకొక బెల్టు షాపు పెడతారా?' అని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు.

# బీసీ కుటుంబాలను లెక్కించకపోవడం దారుణం



**న్యూఢిల్లీ :** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా జనగణలలో భాగంగా కుటుంబాల లెక్కింపు చేస్తూ, బీసీ కుటుంబాలను మాత్రం లెక్కించకపోవడం దారుణమైన అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహా సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ బబన్ రావ్ తైవాడే, ఏపీ అధ్యక్షుడు కేసన శంకర్ రావులు తీవ్రంగా విమర్శించారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం, రాష్ట్రీయ ఓబీసీ మహా సంగ్ ఆధ్వర్యంలో జాతి జన గణనలలో బీసీ కుటుంబాలను లెక్కించి కులగణన ప్రారంభించాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున మహా ధర్నా చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాకు దేశంలోని 16 మంది పార్లమెంట్ సభ్యులు, ఎనిమిది రాజకీయ పార్టీలు, 15 రాష్ట్రాల నుంచి ఓబీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ ఎంపీలతోపాటుకాంగ్రెస్, ఎన్సీపీ, తదితరులు పాల్గొని మహా ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి కొర్రీలు పెడుతూ, అయిష్టంగా వ్యహరించిందని, బీసీల సుదీర్ఘ పోరాట ఫలితంగా కుల గణన చేస్తామని గత ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతి జన గణనను రెండు దపాలుగా చేపట్టాలని నిర్ణయించి, మొదటి దపాలో కుటుంబాలను లెక్కించాలని 33 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, అందులో ఎస్సీ, ఎస్టీ కు టుంబాలను లెక్కించాలని కోరుకుంటూ బీసీ కుటుంబాలను లెక్కించడమే లేక పోవడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై బీసీలకు అనుమానాలు ఉన్నా యాని, బీసీల అనుమానాలను నివృత్తి చేయడానికి ఈ పార్లమెంట్ సమావేశాల్లో నే బీసీ కులదానాపై ప్రత్యేకంగా చర్చించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపక్షంలో దేశవ్యాప్తంగా పోరాడడానికి జాతీయస్థాయిలో జేఏసీ ని ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి లక్షలాది మందితో ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడే కేసిన శంకర్రావు మాట్లాడుతూ బీసీ కుటుంబాల లెక్కింపు తదనంతరం కులగణన లెక్కింపు తర్వాత జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని, బీసీల వాటా బీసీలకు తగ్గేవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు.

కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్ , రావులకోల్ నరేష్ ప్రజాపతి, గొడుగు మహేష్ యాదవ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, వల్లపు శివకుమార్, గూడూరు భాస్కర్ మీరు, ఉదయ్ నేత, సంధ్యారాణి, శివమ్మ, వల్లపు శివకుమార్, మడత వెంకట్ గౌడ్, సదానందం, జనగాం రవీందర్ గౌడ్, కొప్పుల చందు, కొత్త నరసింహస్వామి, దేగల శ్రీనివాస్, బోదాసు రవి, నాగరాజుగౌడ్, బండి గారిరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**పార్లమెంట్ వేదికగా పోరాడుతాం.. కాంగ్రెస్**

దేశవ్యాప్తంగా బీసీ కులగన చేస్తామని విధాన నిర్ణయం ప్రకటించిన కేంద్రం ఇప్పుడు మాట తప్పి వ్యవహరిస్తుందని, కేంద్రం ప్ర భుత్వం రెండు నాలుకల ధోరణిపై పార్లమెంట్‌లో వేదికగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడుతామని కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి తెలిపారు.

**బీసీ కులగణనపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ పెట్టాలి**
**దేశవ్యాప్తంగా బీసీ జేఏసీ ఏర్పాటు చేస్తాం**
**ఢిల్లీలో బీసీల మహా ధర్నాలో**
**అఖిలభారత బీసీ నేతలు జాజుల, కేసన, బబన్ రావ్**
**పార్లమెంటు వేదికగా కొట్లాడుతాం..**
**కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**
**బీసీ ప్రధాని ఉన్న బీసీలకు అన్యాయం జరగడం శోచనీయం..**
**బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్**
**ప్రధానితో చర్చించి బీసీ కులగనణ జరిగేలా కృషి చేస్తాం..**
**టిడిపి ఎంపీలు**
**కులగణాలలో బీసీలను విస్మరిస్తే కేంద్రానికి బుద్ధి చెపుతాం..**
**మహారాష్ట్ర ఎంపీల వెల్లడి**

**బీసీ ప్రధాని ఉన్నా అన్యాయమే... బీఆర్ఎస్**

దేశ ప్రధానిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే ఉన్నప్పటికీ బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన చేయకపోవడమే కాకుండా, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం, మహిళా బిల్లులు బీసీ మహిళలకు సబ్ కోట కల్పించకపోవడం, కొత్త సవాళ్లు బీసీలకు రిజర్వేషన్లు పెట్టకపోవడం చాలా అన్యాయమని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇలాగనే ఉంటే అన్ని పార్టీలు కలుపుకొని ఢిల్లీ కూటమి లక్షలాది మందితో ముట్టడించడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రధానితో చర్చిస్తాం... టీడీపీ**

బీసీల విషయంలో టిడిపి మొదటి నుండి సానుకూల దృక్పథంతోనే ఉన్నదని, బీసీ కులగన విషయంలో తమ అధినేత చంద్రబాబు నాయుడుతో చర్చించి ప్రధానమంత్రి పైన ఒత్తిడి పెంచి బీసీ కులగణన సవ్యంగా జరిగేలా కృషి చేస్తామని టీడీపీ ఎంపీ అప్పలనాయుడు, అంబికాలక్ష్మీనారాయణ, కర్నూలు ఎంపీ నాగరాజు తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ బీసీల విషయంలో రాజీ పడకుండా పోరాడుతామని, బీసీ సంఘాలు చేస్తున్న ధర్నా సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నామని వారు తెలిపారు.



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ప్రజావాణిలో 37 ఫిర్యాదులు

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలను సమర్పించారు. ప్రజల సమస్యలను విన్న కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పదో తరగతి పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ...**

జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో జరుగుతున్న పరీక్షా విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారన్న వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సౌకర్యాలు, పరీక్షా నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులపై ప్రభుత్వం వివక్షత

**నిరసనగా రేపు 'ఛలో హైదరాబాద్'**

**టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**



జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈనెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల 'ఛలో హైదరాబాద్ – ఐ అండ్ పీఆర్ ఆఫీస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంత వరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన 'ఛలో హైదరాబాద్–ఐఅండ్ పీఆర్ ఆఫీస్' ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సమాజంలో విభేదాలు సృష్టించేలా గరికపాటి వ్యాఖ్యలు

**బీఎస్పీ ప్రధాన కార్యదర్శి గుర్రం రాజు ఆగ్రహం**

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**



ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు గుడ్డుపై చేసిన వ్యాఖ్యలపై నారాయణపేట జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి గుర్రం రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దేశంలో బహుజన కులాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలు, సంక్షేమ పథకాలపై తక్కువ చేసి మాట్లాడటం సరికాదని వారు అన్నారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా ముందుకు రావడానికి చదువు మాత్రమే ప్రధాన మార్గమని, అందుకే బహుజన పిల్లలకు విద్యా అవకాశాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ఎలాంటి తక్కువ భావనతో మాట్లాడకూడదని, అలాంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలు సృష్టించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో బహుజన విద్యార్థుల చదువుపై లేదా ప్రభుత్వ పథకాలపై అవమానకర వ్యాఖ్యలు చేయకూడదని వారు హెచ్చరించారు. సమాజంలో ప్రతి వర్గం సమానంగా అభివృద్ధి చెందేందుకు విద్యా అవకాశాలు అందుబాటులో ఉండాలని వారు కోరారు.

## ప్రశాంత వాతావరణంలోశోభాయాత్ర జరుపుకోవాలి

**డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలి**
**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**
**బందోబస్తుపై కమిషనర్, సీపీ అధికారులకు దిశానిర్దేశం**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి. సీతారాం బాగ్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమన్వయ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్‌తో కలిసి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు. శోభాయాత్ర ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తుపై జీహెచ్ఎంసీ కమిషనర్, సీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో జరుపుకోవాలని కోరారు. భద్రత కోసం సుమారు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అడుగడుగునా సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా క్రైమ్ టీమ్స్, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. గతేడాది వాహనాల బ్రేక్‌డౌన్ వల్ల యాత్ర నెమ్మదించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

శోభాయాత్రను మధ్యాహ్నం 1 గంట కల్లా ప్రారంభించాలని, ఇరుకైన మార్గాల్లో పెద్ద వాహనాల వల్ల ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా ట్రయల్ రన్ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలని, ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా పాటలు, ప్రసంగాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు డ్రోన్లు వాడాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు సహకరించి శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటును ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులు భగవంతరావు, గోవింద్ రాఠి, ఆనంద్ సింగ్, కృష్ణ, శశికల (మాజీ కార్పొరేటర్), లాల్ సింగ్ (మాజీ కార్పొరేటర్) అందరూ శోభాయాత్ర సందర్భంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించగా.. దీనిపై కమిషనర్ , సీపీ స్పందిస్తూ అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శోభాయాత్ర వెళ్లే రూట్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, సీపీలు పరిశీలించారు. సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, ఎన్. శ్వేత, జోనల్ కమిషనర్ ముకుందారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారుడి పరిష్కరించాలి

- నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు
- ఎస్పీ డాక్టర్ వినీత్

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులను ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సీఐలు, ఎస్ఐలకు ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా స్వాగతించి, వారి సమస్యలను శ్రద్ధగా వినాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతోనే పోలీస్ స్టేషన్‌కు వస్తారని, అందువల్ల ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు వచ్చిన ఫిర్యాదులు స్టేషన్ స్థాయిలో పరిష్కారం కాకపోతే సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే డీఎస్పీ లేదా జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఇందులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లలో పారదర్శకత, బాధ్యతాయుత విధానాన్ని పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ప్రతి ఒక్కరూ తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించి న్యాయం పొందాలని ఆయన కోరారు.

## రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించండి

**కలెక్టర్ ప్రతీక్ జైన్**



**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవనం ఆవరణలో అంతర్గత రహదారుల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని తెలిపారు. ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు నిర్మించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు నాటి గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో మొగులప్పకు సూచించారు. కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈఈ రాములు, పంచాయతీరాజ్ ఈఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి

- జోనల్ కమిషనర్ రాధిక గుప్తా
- బోడుప్పల్ సర్కిల్‌లో అభివృద్ధి పనులపై పర్యవేక్షణ

**గోల్కొండ టైమ్స్, ఉప్పల్ :**

మల్కాజిగిరి నగరపాలక సంస్థ ఉప్పల్ జోన్‌లోని బోడుప్పల్ సర్కిల్‌లో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్వహణ పనులను జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సమీక్షించారు. ఈ పర్యవేక్షణలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జరుగుతున్న పనులు, రోడ్డు మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సరఫరా వంటి పలు పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యవేక్షణ స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యమని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తెలిపారు.



## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డాక్టర్ వినీత్
- పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

**గోల్కొండ టైమ్స్, నారాయణపేట :**

పదో తరగతి పరీక్షల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు ప్రవేశించే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని ఆదేశించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్(సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ తనిఖీలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్బీ ఎస్ఐ నరేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మార్జిన్ పెంచకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

**చికెన్ వ్యాపారస్తులు**



**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

రాష్ట్రంలో చికెన్ వ్యాపారస్తులు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని చిన్న వ్యాపారస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా బహుళ జాతి కంపెనీలు వ్యాపారస్తులకు సరైన మార్జిన్ ఇవ్వకుండా, అన్యాయమైన విధానాలను అమలు చేస్తున్నాయని తీవ్రంగా ఆరోపించారు. ప్రతి సంవత్సరం ఐదు నుంచి పది రూపాయల వరకు మార్జిన్ పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆ వాగ్దానాలను నిలబెట్టుకోకపోవడంతో పాటు, ఇప్పటికే ఉన్న మార్జిన్‌లో కూడా కోతలు విధిస్తున్న వారు వాపోయారు. దీనివల్ల చిన్న వ్యాపారస్తులు తీవ్ర నష్టాలను చవిచూస్తూ జీవనోపాధిని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నదని గోడును వెళ్లబోసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, చికెన్ వ్యాపారస్తులకు న్యాయమైన మార్జిన్‌ను తక్షణమే కేటాయించాలని చికెన్ వ్యాపారస్తులు డిమాండ్ చేశారు. సోమవారం చికెన్ చిన్న వ్యాపారస్తులు హైదరాబాదులో సమావేశమైన 16 సంఘాల నాయకులు పలు కీలక అంశాలను చర్చించారు. తమ న్యాయమైన డిమాండ్ ను వెంటనే పరిష్కరించకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. చిన్న వ్యాపారస్తుల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

## తాగునీటి కష్టాలను పరిష్కరించండి

**ఘట్ కేసర్ డిప్యూటీ కమిషనర్‌కు టీటీడీపీ శ్రేణులు ఫిర్యాదు**



**గోల్కొండ టైమ్స్, ఘట్ కేసర్ :**

మల్కాజిగిరి నగరపాలక సంస్థ ఘట్ కేసర్ సర్కిల్ లోని ఘట్కేసర్, ఎదులాబాద్ డివిజన్ల పరిధిలో నెల రోజుల నుండి నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజావాణిలో సోమవారం ఘట్ కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణికి టీటీడీపీ శ్రేణులు కలిసి ఫిర్యాదు చేశారు. ఎండల తీవ్రత రాకముందే నీటి కష్టాలు మొదలైతే, నిండు ఎండాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ప్రజావాణిలో టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు.

